క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



కిరాణా దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఎస్‌డీటీ సాయికృష్ణ

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉన్న పీడీఎస్ బియ్యాన్ని తెర్లాం సీఎస్‌డీటీతో పాటు బొబ్బిలి సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణలు మంగళవారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. గ్రామంలోని రేపాక రామారావు ఇంట్లో నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నాయన్న సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది కిరాణాషాపులో సోదాలు చేసి నిల్వ ఉంచిన బియ్యాన్ని గుర్తించారు. అవి పూర్తిగా పేదలకిచ్చే చౌకధరల బియ్యమేనని గుర్తించి 1230 కిలోల బియ్యం సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి స్థానిక డీలర్‌కు ఆ బియ్యాన్ని అప్పగించామని సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న ఈ దందాలపై నిఘా ఉంచామని సమాచారం తెలియజేస్తే వెంటనే చర్యలు చేపడతామన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలుపుదల

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పాలకొండ రోడ్డులో పైపులైన్ లీకుల కారణంగా ఈ నెల 13వ తేదీన తాగునీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. పైపులైన్ మరమ్మతుల దృష్ట్యా నీటి సరఫరాకు అంతరాయం కలగనుందని, పట్టణవాసులు గమనించి, సహకరించాలని కోరారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

బాడంగి: మండలంలోని కోటిపల్లి హెల్త్ సబ్ సెంటర్ వద్ద ఉచిత నేత్రవైద్య శిబిరం గురువారం నిర్వహిస్తున్నట్లు క్యాంపు కో–ఆర్డినేటర్ సీహెచ్ వెంకటరమణ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పొలం పిలుస్తోంది'

రేగిడి: మండలంలోని కొమెర, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏవో మురళీకృష్ణ మాట్లాడు తూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కోసం రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. తుంపర, బిందు సేద్యాలకు అవసరమైన పరికరాలు పొందాలన్నారు. అలాగే రైతులకు కేటాయిస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

బాడంగి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోడూరు, రామచంద్రాపురం గ్రామాల్లోని రైతులకు వేరుశనగ, నువ్వు పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఏవో కె.శిరీష అవగాహన కల్పించారు.

ఖాదర్‌బాబాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



బాబా సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: విజయనగరం జిల్లా కేంద్రంలోని బాబామెట్టలో జరుగుతున్న 66వ సూఫీ సుగంధ మహోత్సవాలకు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు బుధవారం హాజరై, ఖాదర్ బాబాను దర్శించుకుని, చాదర్ సమర్పించారు. హజరత్ షరీఫ్ అవుతుల్లా ఖాదర్ వలీ బాబా.. దైవస్వరూపులని ఆయనను దర్శించుకోవడం అదృష్టమని మాజీ ఎమ్మెల్యే అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను ఆశ్రమ నిర్వాహకులు సత్కరించారు. ఆయన వెంట జెడ్పీటీసీ పి.రామారావు ఉన్నారు.

బస్తాల కొద్దీ ధాన్యం.. కొనేవారేరీ?



సిరిపురం కళ్లాల్లో విక్రయానికి సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు

- ధాన్యం కొనుగోళ్లలో చేతులెత్తేసిన ప్రభుత్వం
- చివరి గింజ వరకు కొంటామని ప్రచారార్భాటం
- ఇప్పుడు టార్గెట్ పూర్తయిందని కొనుగోళ్లు నిలుపుదల
- పొలాల్లో భారీగా వరిచేను కుప్పలు
- కళ్లాల్లో విక్రయానికి సిద్ధంగా ధాన్యం బస్తాలు
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతుల విజ్ఞప్తి

రాజాం:

ధాన్యం కొనుగోళ్లలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. కొనుగోళ్ల ఆరంభంలో చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రచారం ఎంతో ఆర్భాటంగా చేసుకుంది. తీరా ఇప్పుడు చూస్తే టార్గెట్(ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం) పూర్తయిందని, కొనుగోళ్ల కేంద్రాలను మూసేసి, ధాన్యం కొనుగోళ్లను నిలిపివేసింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. సగానికి పైగా ధాన్యం రైతుల వద్దే ఉన్నాయి. తమ ఆరుగాలం కష్టం దళారుల పాలవుతోందని వాపోతున్నారు.

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. ఈ–క్రాప్ నమోదు ఆధారంగా రైతులకు ట్రక్ షీట్లు జనరేట్ చేయడం, సంబంధిత మిల్లులకు టార్గెట్‌లు ఇచ్చి రైతుల ద్వారానే ఆయా మిల్లులకు ధాన్యం సేకరించే కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం కొత్తగా వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం రైతు ఎక్కడైనా ధాన్యం విక్రయించుకోవచ్చని చెప్పడంతో పాటు మిల్లర్లు ఎక్కడైనా ధాన్యం కొనుగోలు చేసుకోవచ్చని జీవో జారీ చేసింది. దీంతో మిల్లర్లలో కొంతమంది దళారుల అవతారమెత్తి తమకు అనుకూలంగా ఉన్న రైతుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు చేసినట్లు ట్రక్‌షీట్లు జనరేట్ చేయించుకోవడం, చివరకు రవాణా వాహనాల జీపీఎస్‌ను కూడా ట్రాప్ చేసి తమ టార్గెట్లు పూర్తయినట్లు చూపించారు. ఫలితంగా ఇప్పుడు రైతుల వద్ద పెద్దమొత్తంలో ధాన్యం ఉండిపోయింది. తమ ధాన్యం కొనేవారెవరని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

అపరాలు ఉన్నాయని..

రాజాం నియోజకవర్గంలో అధిక శాతం రైతులు వరి సాగు చేస్తారు. నిన్నటి ఖరీఫ్‌లో నియోజకవర్గంలో 52 వేల ఎకరాల్లో వరి పంట సాగు జరిగింది. ఈ పంట ద్వారా 14.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేశారు. ఇందులో 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లను లక్ష్యంగా పెట్టుకున్నారు. మిల్లులకు టార్గెట్‌లు మాత్రం 6 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే ఇచ్చారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని రైతులు సగం వరి చేనును పంట పండిన వెంటనే నవంబర్, డిసెంబర్ నెలల్లో నూర్పిడి చేసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు విక్రయించారు. మిగిలిన రైతులు అపరాల పంటలు సాగుచేస్తుండడంతో పొలాల్లో వరిచేను కుప్పలు ఉంచేసి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో అపరాల పంటల సాగు పూర్తయిన తర్వాత నూర్పిడికి సిద్ధం చేస్తున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో దళారీలకు..

ప్రస్తుతం ఈ నూర్పిడి చేసిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. తమకు టార్గెట్ లేదని, పంటను కొనుగోలు చేయలేమని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారీలను ఆశ్రయించి, నష్టానికి ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. 80 కిలోల బస్తాకు 10 కిలోలు అదనంగా ధాన్యాన్ని ఇస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయంపై రాజాం సీఎస్‌డీటీ చిరంజీవి వద్ద సాక్షి ప్రస్తావించగా, ప్రస్తుతం ధాన్యం కొనుగోలు నిలుపుదల వాస్తవమేనన్నారు. మిల్లర్ల టార్గెట్ పూర్తి కావడంతో కొనుగోలు చేయడంలేదని, త్వరలో జిల్లా అధికారులు నుంచి కొనుగోళ్లకు ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందన్నారు.

ట్రక్ షీట్లు ఇవ్వడం లేదు..



పొలాల్లో అపరాలు ఉన్నాయని వరిచేను నూర్పిడి చేయలేదు. ఇప్పుడు వరి పంట నూర్పిడి చేస్తామంటే రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోళ్లకు ట్రక్ షీటు ఇవ్వడం లేదు. మిల్లర్లు మాకు మీ ధాన్యం వద్దంటున్నారు. ఏం చేయాలో తోచడం లేదు.

–గురుగుబెల్లి దశరథరావు, రైతు, వాల్తేరు, సంతకవిటి మండలం

ఇలాగైతే వ్యవసాయం చేయలేం..



గతంలో రైతు ఫిర్యాదు చేస్తే అధికారులు పరుగులెట్టేవారు. గతేడాది పండగ తర్వాతే ధాన్యం అమ్ముకున్నాం. మాకు భయం లేకుండా కేటాయించిన మిల్లుకు ధాన్యం విక్రయించే అవకాశం ఉండేది. ఇప్పుడు మీ ధాన్యం మాకు వద్దు అంటున్నారు. మేం కొనలేం అంటున్నారు. రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది కూడా ఏమీ తెలియదంటున్నారు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. ఇలాగైతే వ్యవసాయం చేయలేం.

–గొల్లపల్లి అమృతరావు, రైతు, వాల్తేరు, సంతకవిటి మండలం



తమరాం వద్ద పొలాల్లో పాడవుతున్న వరిచేను కుప్పలు

పరామర్శ



రేగిడి: ఈశ్వరమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన టంకాల ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు బుధవారం ఆ గ్రామం వెళ్లి, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు, సర్పంచ్‌లు టంకాల ఉమాపాపినాయుడు, కరణం శ్రీనివాసరావు, కెల్ల మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.



సంతకవిటి: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, తదితరులు

సంతకవిటి: మండలంలోని కావలి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు కావలి జయలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్‌రావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడులు ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వారి వెంట సర్పంచ్ తమ్మినేని రవీంద్ర తదితరులు ఉన్నారు.

తెర్లాం: మండలంలోని నెమలాం గ్రామంలో ఇటీవల హత్యకు గురైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోనారి ప్రసాద్ కుటుంబాన్ని ఎమ్మెల్యే బేబీనాయన పరామర్శించారు. హత్యకు గల కారణాలు ఏమై ఉండొచ్చని కుటుంబ సభ్యులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్ హత్యకు గురికావడం బాధాకరమని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు.

రాయితీపై 'పీఎం సూర్యఘర్' యూనిట్లు

వంగర: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రాయితీపై పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లు మంజూరు చేయనున్నట్లు రాజాం వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. యూనిట్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీలకు తొలి ప్రాధాన్యమివ్వాలని, యూనిట్ విలువ ఆధారంగా రాయితీ సదుపాయం ఉంటుందన్నారు. వీవోఏలు విధులు సక్రమంగా నిర్వహించాలని, ప్రతీ మహిళ నుంచి నెలకు రూ.200 పొదుపు చేసేలా చైతన్యం చేయాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ ద్వారా పొందిన రుణాలు శతశాతం రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు టి.మంగమ్మ, టి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచికరమైన భోజనం పెట్టాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచి, శుచికరమైన భోజనం పెట్టాలని ఎంఈవో త్రినాధరావు సూచించారు. మండలంలోని పణుకువలస ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం వంటకాలు, మరుగుదొడ్లు ఆయన పరిశీలించారు. అలాగే విద్యార్థుల చేతిరాత, అభ్యసన సామర్థ్యాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు చేసి పెట్టాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలని కోరారు.

అందని అత్యవసర వైద్యం



బాడంగి సీహెచ్‌సీలో 108 అంబులెన్స్ నిరుపయోగంగా ఉంది. మారుమూల గ్రామాల నుంచి రోగులను ఇక్కడకు తీసుకురావాలన్నా.. ఇక్కడి నుంచి మెరుగైన వైద్యానికి జిల్లా ఆస్పత్రికి తరలించాలన్నా ఈ వాహనమే ఆధారం. ప్రస్తుతం అది మూలకు చేరడంతో సకాలంలో అత్యవసర వైద్యం అందడం లేదని గ్రామీణులు గగ్గోలు పెడుతున్నారు. ఇదే విషయమై ఆస్పత్రికి ఇన్‌చార్జ్ డాక్టర్ నాగేశ్వరరావును సంప్రదించగా, ఇంధనం, డ్రైవరు లేని కారణంగా వాహనం త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. –బాడంగి

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సంతకవిటి: వాల్తేరులో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సంతకవిటి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఈ నెల 27న ఎన్నికలు జరగనుండడంతో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తున్నారు. దీనిలో భాగంగా యూటీఎఫ్ నాయకులు బూరాడ శ్రీనివాసం, శాసపు బాబూరావునాయుడులు మండలంలోని వాల్తేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పీడీఎఫ్ అభ్యర్థిగా బరిలో ఉన్న కోరెడ్ల విజయగౌరికి తొలి ప్రాధాన్యతా ఓటు వేసి, అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

వంగర: మండలంలోని అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా, మండల స్థాయి నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న పాకలపాటి రఘువర్మను గెలిపించాలని వారు కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి



తెర్లాం: రైతులకు అవగాహన కల్పిస్తున్న రామభద్రపురం హెచ్‌వో మోహన్‌కృష్ణ, ఏవో సునీల్‌కుమార్

తెర్లాం: మామిడి పూతను ఆశించే తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని రామభద్రపురం ఉద్యాన శాఖాధికారి పి.మోహన్‌కృష్ణ, ఏవో జి.సునీల్‌కుమార్ సూచించారు. మండలంలోని పెదపాలవలస గ్రామంలోని మామిడి తోటలను వారు బుధవారం పరిశీలించారు. అధిక ఉష్ణోగ్రతలు, మంచు కారణంగా మామిడి తోటలను ఆశించే తెగుళ్లను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్నామని వారు చెప్పారు. మామిడిపూత, పిందెను తినే పచ్చపురుగు, పగటి వేళల్లో ఉష్ణోగ్రత పెరగడంతో తామర పురుగులు, ఉదయం, రాత్రి వేళల్లో మంచు కారణంగా వచ్చే బూడిద, బూజు తెగుళ్లు ఆశిస్తున్నట్లు గుర్తించామన్నారు. బూడిద, బూజు తెగుళ్ల నివారణకు థయోమిదాక్సిమ్ 0.5 గ్రాములు, హెక్సాకొనజోల్ 2ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పూతపై పిచికారీ చేయాలని, అలాగే పూత, పిందెను తినే పచ్చ పురుగులను నివారించేందుకు పైన చెప్పిన మందులతో పాటు ఎమాక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి పిందెలు రాలిపోకుండా ప్లానోఫిక్స్– 44 గ్రాములు, బోరాన్–88 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేస్తే పిందె రాలడం తగ్గుతుందన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని పక్కి, శివడవలస గ్రామాల్లో మామిడి, జీడి పంటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై ఉద్యానశాఖాధికారి బి.వెంకటరత్నం బుధవారం అవగాహన కల్పించారు.

బూరాడలో ఇంటింటా సర్వే

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామంలో ఇంటింటా సర్వే బుధవారం చేపట్టారు. పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్ల వయసులోపు వారిలో పుట్టుకతో వచ్చే లోపాలు, పౌష్టికాహార లోపం, బాల్యంలో వచ్చే వ్యాధులతో బాధపడే వారి వివరాలను సిబ్బంది సేకరించారు. ఆయా సమస్యలతో బాధపడే వారిని జిల్లా కేంద్రంలోని డైస్ కేంద్రానికి పంపిస్తున్నామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రాజాం సిటీ: రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి రమాదేవి కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలు, వెలుగు సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సహజ సిద్ధంగా పంటలు పండించాలని తెలిపారు. ప్రకృతి సాగుతో పాటు 365 రోజుల కిచెన్ గార్డెన్‌పై కూడా దృష్టిపెట్టాలన్నారు. అనంతరం వివిధ కషాయాల తయారీ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ఏపీఎం భవాని, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రాజాం: పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ సూచించారు. స్థానిక పట్టణంలోని తాణావీధి, శ్రీనివాసానగర్, గాయత్రీకాలనీ, వాసవీనగర్ ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన ఆయన అక్కడి పారిశుధ్య పరిస్థితులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

బొబ్బిలిరూరల్: ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో జాగాన విజయలక్ష్మి, ఎంపీడీవో రవికుమార్‌లు సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు. అయొడిన్ లోపంతో రక్తహీనతతో పాటు థైరాయిడ్, క్రిటినిజం వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తాము తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు.

'మత్తు'తో జీవితం చిత్తు



మత్తు పదార్థాలతో జీవితం నాశనం(చిత్తు) అవుతుందని, గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. రాజాం మండలంలోని శ్యాంపురంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలోని యువత, విద్యార్థులు ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి గంజాయి, మద్యం, సిగరెట్‌లకు బానిసలై తమ జీవితాలు చెడగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకుని, ఉత్తమ పౌరులుగా జీవించాలని ఆకాంక్షించారు.

–రాజాం సిటీ

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమానికి సిద్ధం



విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమానికి సిద్ధమవుతాయని ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సదాశివరావు హెచ్చరించారు. రామభద్రపురం మండలం, బూసాయవలస కేజీబీవీలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడుతో కలిసి ఉపాధ్యాయులతో బుధవారం సమావేశమయ్యారు. కేజీబీవీల టీచర్లను రెగ్యులర్ చేయాలని, పాతపెన్షన్ విధానం అమలు చేయాలని, 11వ పీఆర్సీ డీఏ, సరెండర్ లీవ్, పీఎఫ్ బకాయిలను చెల్లించాలని, అలాగే జీవో నంబరు 117 రద్దు చేసి, కిలోమీటరు దూరంలో ప్రాథమిక పాఠశాల, 3 కిలోమీటర్ల దూరంలో ప్రాథమికోన్నత పాఠశాల ఉండేలా చూడాలని, హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని, ఉపాధ్యాయుల భర్తీ చేపట్టాలని, ప్రస్తుత ఉపాధ్యాయులకు శాశ్వత బదిలీ కోడ్ రూపొందించాలని కోరారు.

–రామభద్రపురం

సంక్షిప్తంగా...

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎ.వెలగవలస గ్రామానికి చెందిన తోట లక్ష్మణ, అతడి కొడుకు భూషణం ఇటీవల వరుసగా చనిపోగా బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు శంబంగి వేణులు ఆర్థికసాయం చేశారు. మొత్తం రూ.10 వేలను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు బొంగు త్రినాథ చేతులమీదుగా మృతుడు లక్ష్మణ భార్య విజయమ్మకు బుధవారం అందజేశారు.

ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు

బొబ్బిలి: మండల కేంద్రంలో ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్లాటినం జూబ్లీ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. సంఘ నాయకులంతా పతాకావిష్కరణ చేసి, సంఘం ఏర్పాటు ముఖ్య ఉద్దేశం, సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో విజయనగరం ప్రాంతీయ అధ్యక్షుడు వంగపండు లక్ష్మణరావు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బోగి సూరి, గేదెల దేముడు పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి తరలించాలి

బొబ్బిలి: గుండెపోటుకు గురైన గంటకాలాన్ని గోల్డెన్ అవర్ అంటారని, ఆ సమయంలో ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి జి.శశిభూషణరావు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో గుండెపోటు నివారణకు ఇచ్చే స్టెమీ ఇంజెక్షన్‌పై బుధవారం అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన తొలి గంటకాలం చాలా కీలమని, ఈ సమయంలో తప్పనిసరిగా దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి రోగిని తరలిస్తే స్టెమీ ఇంజెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

సంచార గ్రంథాలయం ప్రారంభం

బొబ్బిలి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట విశాలాంధ్ర సంచార గ్రంథాలయ వాహనాన్ని సీఐ కె.సతీష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయంలో లభించే పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత 'బలిజిపేట'

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో ఉంగట్లవీధి యూత్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ముగిశాయి. బుధవారం జరిగిన ఫైనల్ పోరులో రొంపల్లి జట్టుపై బలిజిపేట జట్టు విజయం సాధించి, ట్రోఫీ కైవసం చేసుకుంది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10 వేల నగదును సర్పంచ్ మాధవ చేతులమీదుగా అందజేశారు.

ఆగూరు కళాకారుడికి రావికొండలరావు పురస్కారం

రాజాం: మండలంలోని ఆగూరుకు చెందిన పౌరాణిక నాటక రంగస్థల కళాకారుడు సత్యవరపు రాముకు రావికొండలరావు స్మారక నగదు పురస్కారం లభించింది. ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లోని సిద్ధార్థ నగర్ పార్కు వద్ద సాహిత్య సంగీత సమాఖ్య వేదిక ఈ పురస్కారాన్ని సినీ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్, సినీ దర్శకులు రేలంగి నరసింహారావుల చేతులమీదుగా రాముకు అవార్డు అందించి, సత్కరించారు. విశ్వామిత్ర పాత్రతో కళాభిమానులను అలరిస్తున్న రాముకు అవార్డు రావడం పట్ల పద్మశ్రీ యడ్ల గోపాలరావు, పలువురు రంగస్థల కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ

రేగిడి: తూటికాడ కషాయంతో పంటలకు వచ్చే తెగుళ్లతో పాటు దోమపోటును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ రమాదేవి తెలిపారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో తూటికాడ కషాయం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. 30 లీటర్ల ఆవుమూత్రం, 30 కిలోల తూటికాడ ఆకులను కలిపి మరగబెట్టి తయారైన కషాయాన్ని వరి పంటకు స్ప్రే చేస్తే సుడిదోమ, తెల్లదోమ నివారణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

రేగిడి: ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై అప్పాపురం, మజ్జిరాముడుపేట గ్రామాల రైతులు మండలంలోని సంకిలి సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ జొన్నాడ సుమకు బుధవారం వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాల్లో 52 మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయిందన్నారు. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కరణం శ్రీనివాసరావు తదితరులు కోరారు.

మార్చి 20లోగా గోకులాలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదాదేవి

రాజాం సిటీ: ప్రతీ గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న గోకులాలను మార్చి 20వ తేదీలోగా పూర్తిచేయాలని డ్వామా పీడీ శారదాదేవి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం, బాడంగి, మెరకముడిదాం టెక్నికల్ అసిస్టెంట్‌లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముందుగా గ్రామాల్లో గోకులాల నిర్మాణాలకు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను గుర్తించాలని, ప్రతీ కుటుంబానికి 100 రోజుల పాటు పనులు కల్పించి, రోజుకు రూ.300లు వేతనం గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పనులు చేయించాలన్నారు. ఫిష్ పాండ్, ఫారంపాండ్స్, ఇంకుడుగుంతల పనులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు, ఏపీడీలు ఎం.శ్రీనివాసరావు, చిన్నంనాయుడు, ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.